క్లుప్తంగా

నేడు సమావేశం

దామెర : దామేశ్వరాలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం ఉదయం 7.30 గంటలకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దామేశ్వరాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి గ్రామ పెద్దలు, భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన మేకల ఐలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ సదానందం శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 3వేల ఆర్థికసాయం అందించారు. సమ్మయ్య, బుచ్చం, భిక్షపతి, కుమారస్వామి, యాకయ్య, కుమారస్వామి, సమ్మయ్య, బీరయ్య, రాజు, రంజిత్, రమేష్, రాజు, రోహిత్, రాములు, సురేష్, కోటి ఉన్నారు.

ఉచిత వైద్యం అందించాలి



శాయంపేట : నిరుపేద పద్మబ్రాహ్మణ కుటుంబాలకు ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మలిపెద్ది కృష్ణశాస్త్రి డిమాండ్ చేశారు. శాయంపేట గ్రామానికి చెందిన ఆ సంఘం కోశాధికారి మార్త వేణుగోపాల్ సతీమణి జ్యోతి డెంగీ బారిన పడి కోలుకోగా శనివారం భారతి చారిటబుల్ ట్రస్ట్, పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం పాలకవర్గం సభ్యులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థికసాయంతో పాటు పండ్లు అందించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, సంఘం సభ్యులు రాజకుమార్, జలేందర్, కరుణాకర్, సురేష్, శివసాయి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో సమాజ అభివృద్ధి

రాయపర్తి : ప్రజలు ఆర్థిక అక్షరాస్యత సాధిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎఫ్ఎల్‌సీ కౌన్సెలర్ ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని గట్టికల్‌లో నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఏపీ గ్రామీణ వికాస బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. 2025 జనవరి 15 వరకు జన సురక్ష పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనలో 18 నుంచి 50 ఏళ్ల వరకు వయస్కులైన వారు ఏటా రూ.436 చెల్లించి చేరితే ఖాతాదారు అకాల మరణం లేదా సహజ మరణం చెందినా బాధిత కుటుంబానికి రూ.2 లక్షల బీమా అందుతుందని చెప్పారు. అలాగే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకంలో 18 నుంచి 70 ఏళ్ల వరకు వయస్సున్న వ్యక్తులు ఏటా రూ.20 చెల్లించి చేతితో ఖాతాదారు ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం అందుతుందని వివరించారు. అలాగే జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా వెయ్యి రూపాయలు చెల్లిస్తే రూ.20 లక్షల బీమాను ఖాతాదారులు వినియోగించుకోవచ్చని చెప్పారు. వ్యవసాయ రుణాలను ఏడాదిలోపు రెన్యూవల్ చేసుకుంటే వడ్డీ రాయితీ లభిస్తుందని తెలిపారు. సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు, ఇతర వ్యక్తిగత ఖాతా వివరాలు ఇతరులకు వెల్లడించొద్దని స్పష్టం చేశారు. సదస్సులో పంచాయతీ కార్యదర్శి సుమలత, బ్యాంకు ఉద్యోగులు శైలజ, అంజి, కౌన్సిలర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

నర్సంపేట రూరల్ : 2025 మార్చిలో జరగనున్న నల్గొండ, వరంగల్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మండలంలోని ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంఈఓ కొర్ర సారయ్య కోరారు. నర్సంపేటలోని జెడ్పీ బాలుర సెకండరీ స్కూల్‌లో ఆన్‌లైన్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి నమోదు పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల, అన్ని గురుకుల పాఠశాలలు, యూనివర్సిటీల్లో పని చేస్తున్న అధ్యాపకులు గడచిన ఆరేళ్లలో మూడు సంవత్సరాలు పని చేసిన అర్హత కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా చెప్పారు.

నిరుపయోగంగా డంపింగ్‌యార్డులు

- లక్షలాది రూపాయలు వృథా
- కంపు కొడుతున్న వీధులు
- కరువైన అధికారుల పర్యవేక్షణ



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డు

వేలేరు : గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ మెరుగుపర్చడంతో పాటు వీధుల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో డంపింగ్ యార్డుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. లక్షలాది రూపాయలతో నిర్మించిన ఈ డంపింగ్ యార్డుల సరియైన నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయగా.. ఒకటి, రెండు మినహా అన్ని గ్రామాల్లో వినియోగంలోకి రాలేదు.

లక్షలాది రూపాయలు వృథా..

మండలంలో డంపింగ్ యార్డుల నిర్మాణం కోసం ఒక్కోషెడ్డుకు రూ.2.50 లక్షల చొప్పున వెచ్చించారు. చెత్తను తరలించేందుకు ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రతీరోజు ఉదయమే పంచాయతీ సిబ్బంది వీధుల్లోకి ట్రాక్టర్‌తో వచ్చి చెత్తను సేకరిస్తారు. సేకరించిన పొడి చెత్తలోని కాగితాలు, అట్టముక్కలు, గాజుసీసాలు, ఇతర వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది వేరు చేసి తడి చెత్తను ప్రత్యేక పద్ధతిలో నిల్వా చేసి కంపోస్టు ఎరువుగా మార్చాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా కూడా చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చే చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. డంపింగ్ యార్డుల నిర్మాణం పూర్తై ఏళ్లు గడుస్తున్నా వాటిని ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గ్రామాల్లోని కాల్వల్లో, రోడ్ల పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. అలాగే పలు డంపింగ్ యార్డులకు సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తడి, పొడి చెత్తపై అధికారులు అవగాహన కల్పించి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కాల్వలో పడేసిన చెత్తాచెదారం, చికెన్ వ్యర్థాలు

చికెన్ వ్యర్థాలతో కంపు..



కొందరు చికెన్ సెంటర్ నిర్వాహకులు చెత్తతో పాటు చికెన్ వ్యర్థాలను కాల్వలో పడేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతుంది. వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ఆదారి గుండా వెళ్లే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కాల్వలో చికెన్ వ్యర్థాలు, చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలి. మండల ప్రజల ఆరోగ్య దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించాలి.

– కొయ్యడ రవి, గ్రామస్తుడు

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్ : భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించేందుకు జస్టిస్ పున్నయ్య కమిషన్ చేసిన సిఫారసుకు అనుగుణంగా ప్రతీనెల 30వ తేదీన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ కోరారు. ఈ మేరకు శనివారం కమలాపూర్ తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందించారు. రోజురోజుకు సమాజంలో పెట్రేగిపోతున్న కుల వివక్షను, దళితులపై జరుగుతున్న దాడులను నిర్మూలించేందుకు ప్రతీనెల పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఐలయ్య, రమేష్‌తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌లో 'వంగపల్లి వాసి'



కమలాపూర్ : రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లోని మహారాజా గంగాసింగ్ విశ్వ విద్యాలయంలో ఈనెల 18, 19 వ తేదీల్లో జరిగిన 61వ ఆల్‌ఇండియా పొలిటికల్ సైన్స్ కాన్ఫరెన్స్ జాతీయ సెమినార్‌లో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని వంగపల్లికి చెందిన కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ పరిశోధక విద్యార్థి అంకిళ్ల శంకర్ పాల్గొన్నాడు. ఈ సెమినార్‌లో పంచాయతీరాజ్ చట్టం అమలులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ మహిళల భాగస్వామ్యం అనే అంశంపై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు శంకర్ తెలిపారు. తాను ఈ సెమినార్‌కు ఎంపిక కావడానికి సహకరించిన పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, ప్రొఫెసర్లు దినేష్‌కుమార్, రామచంద్రం, బీఓఎస్ డాక్టర్ కృష్ణ, కాంట్రాక్ట్ లెక్చరర్ సత్యనారాయణ, పార్ట్ టైం లెక్చరర్ నాగరాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపులేదా..?



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

ఐనవోలు : రోడ్డుపై ఏర్పడిన గుంతతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులకు చలనం లేదని వాహనదారులు ఆగ్రహిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు కాబట్టి వారే పూడ్చాలని తాము ఏం చేయలేమంటూ గ్రామ పంచాయతీ అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రం నుంచి వెంకటాపూర్ బైపాస్, గర్నెపల్లి మలుపు, మల్లికార్జునస్వామి ఆలయ దక్షిణ గేటు వద్ద రోడ్డుపై డ్రెయినేజీ మరమ్మతుకు రావడంతో రెండేళ్ల క్రితం పెద్ద గుంత ఏర్పడింది. ఈ గుంతను గతంలో కొంతమేర పూడ్చి వదిలేశారు. దీంతో అటువైపుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు, బాటసారులకు ప్రమాదకరంగా మారింది. ఇటీవల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టిసారించి గ్రానైట్ లారీలు, అధిక బరువుగల వాహనాలను నియంత్రించాలని, బీటీ రోడ్డు వేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, గ్రామస్తులు తదితరులు కోరుతున్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



నడికూడ : పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యూఎఫ్‌పీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ యాకూబ్‌పాషా డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 23 వ తేదిన జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, జీఓ 317ను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, రఘు, ఆసిఫ్‌ఖాన్, ఏలియా పాల్గొన్నారు.

బాలబాలికల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంఈఓ హనుమంతరావు

నడికూడ : బాలబాలికల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈఓ కునుశోతు హనుమంతరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లింగ వివక్ష నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మహిళ సాధికారత కోసం ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. సమాజంలో మహిళల సమానత్వం కోసం పాటుపడే వ్యవస్థలను నిర్మించుకోవాలని, స్త్రీ, పురుషులను సమానంగా చూడాలన్నారు. బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్ సుభాని, శారద, శ్రీనివాస్, జోత్స్న, సుమలత, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు, సర్వోదయ ప్రతినిధులు రవీందర్, శ్రీలతతో పాటు తదితరులు పాల్గొన్నారు.


ఒకరి అరెస్ట్

శాయంపేట : గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతిసింగారం, వసంతాపూర్ గ్రామాల్లో శనివారం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో గంగిరేణిగూడెం చేరుకోగానే అదే గ్రామానికి చెందిన బానోతు రమేష్ ఇంటి వద్ద గుడుంబా తయారు చేసి విక్రయించేందుకు వెళ్తూ పోలీస్‌ల రాకను గమనించిన అతడు తన వద్ద ఉన్న గుడుంబా ప్యాకెట్ల వదిలి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న 15లీటర్ల గుడుంబాను సీజ్ చేసి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఇందిరమ్మ' కమిటీల ఎంపికలో వర్గపోరు

వేలేరు : మండలంలోని కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌లో వర్గపోరు మొదలైనట్లు విమర్శలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పాటు చేయగా పాత క్యాడర్‌తో పాటు కొత్తగా చేరిన నాయకులు వర్గాలుగా చీలిపోయినట్లు చర్చలు జరుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ఎంపికలో రెండు జాబితాలు సమర్పించి తమవర్గం వారినే ఎంపిక చేయాలని లాబీయింగ్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గత పదేళ్లుగా అధికారంలో లేకున్నా పార్టీని నమ్ముకుని, పార్టీ జెండా మోసిన తమకు ఇందిరమ్మ కమిటీల్లో అవకాశం ఇవ్వకుండా కొత్తగా పార్టీలో చేరిన నాయకులే తమపై పెత్తనం చెలాయించడం ఏంటని మండల ఇన్‌చార్జ్ రాజేశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో హైదారాబాద్‌లోని గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వివిధ గ్రామాల్లో కొంతమంది కొత్తగా పార్టీలో చేరిన నాయకులు ఇందిరమ్మ కమిటీల్లో వారి అనుచరుల పేర్లు రాసుకుని పాత క్యాడర్‌కు అన్యాయం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. దీనిపై తక్షణమే చర్య తీసుకోవాలని కోరినట్లు తెలిసింది.

మూడు కిలోల ఎండు గంజాయి స్వాధీనం



అరెస్టు చూపుతున్న సీఐ సంతోష్

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్లబయ్యారానికి చెందిన మందానపు సుభాష్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని భూపాలపట్నం ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర వెంకటశ్రీనివాస్ అనే వ్యక్తి దగ్గర రూ.3వేలకు కిలో చొప్పున 3 కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ గంజాయిని వరంగల్‌లో గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించేందుకు శనివారం గార్లబయ్యారం నుంచి తవేరా వాహనంలో వెళ్తుండగా వాహనాల తనిఖీలు చేస్తున్న ఎస్సై పరమేశ్వర్ పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. దీంతో తవేరా వాహనాన్ని, ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని సుభాష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ ఈ సందర్భంగా తెలిపారు.

జంక్షన్ సుందరీకరణకు సహకరించాలి

ఎంపీడీఓ విజయ్‌కుమార్

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో చేపట్టే జంక్షన్ సుందరీకరణలో భాగంగా బస్టాండ్ సమీపంలోని చిరువ్యాపారస్తులతో ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ జగత్‌సింగ్ శనివారం సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. మండల కేంద్రం అభివృద్ధి, జంక్షన్ ఏర్పాటులో చిరువ్యాపారస్తులతో పాటు అధికార పార్టీ నాయకులు, ఇతర పార్టీల నాయకులు, ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండలం అభివృద్ధి చెందితేనే ప్రజలు ఆర్థికంగా, వ్యాపారపరంగా ఎదుగుతారని అన్నారు. ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా జంక్షన్ ఏర్పాటుకు అందరూ సహకరించాలని అన్నారు. చిరువ్యాపార సంస్థల ఏర్పాటు కోసం మరోచోట ప్రభుత్వ స్థలం చూపించనున్నట్లు చెప్పారు. దీంతో చిరువ్యాపారస్తులు సుముకంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సదస్సులో చిరువ్యాపార సంస్థల యాజమానులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములుకావాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు తోడ్పటునందించాలని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు కోరారు. శనివారం పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల పురోగతి గురించి వారి తల్లిదండ్రులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన లభిస్తుందని అన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు అనుకున్న స్థాయిలో రాణించలేకపోతున్నారని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, దుస్తులు, టెక్ట్స్‌బుక్స్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. కొంతమంది పేరెంట్స్ బ్యాగ్, పెన్ను, పెన్సిల్స్ కూడా విద్యార్థులకు కొనివ్వడం లేదన్నారు. విద్యార్థుల అవసరాలపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. విద్యావారధి స్వచ్ఛంద సంస్థ, పాఠశాల ఉపాధ్యాయులు ప్రతీనెల కొంత డబ్బు వెచ్చించి విద్యార్థులకు కావలసినవి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

హన్మకొండ : సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సూచించారు. హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని కాకతీయ సహకార శిక్షణ కళాశాలలో సహకార సంఘాల ఉద్యోగులకు ఐదు నెలల పాటు జరిగిన సహకార డిప్లమా కోర్సు శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ ఉద్యోగుల్లో నైపుణ్యం పెంచుతుందన్నారు. సహకార రంగం అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. పాలక వర్గాలు వస్తాయి పోతాయని, ఉద్యోగులు ఎప్పుడూ ఉంటారని అన్నారు. సహకార వ్యవస్థ బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. నైపుణ్యం, విజ్ఞానం కలిగి ఉండి ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలన్నారు. అనంతరం సహకార గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. సహకార రంగం అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని, ప్రభుత్వం సహకార రంగం బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. కాకతీయ సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ యాకూబ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.రాజయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, సంధ్యారాణి పాల్గొన్నారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఆ యూనియన్ చైర్మన్ మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలి



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలను సందర్శించి భవనాన్ని పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాల భవనం పైకప్పు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతూ రాడ్లు తుప్పు పట్టాయని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరుగకముందే అధికారులు, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పందించి పాఠశాల భవనం మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థుల తరుపున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కిషన్, నాయకులు సదానందం, శ్రీనివాస్, వేణు, కవిత, సాయి, రాణాప్రతాప్, రాజేందర్, నవి, భాస్కర్, రమేష్ ఉన్నారు.

దేశాభివృద్ధి కోసం కృషిచేస్తున్న మోదీ



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాయకులు

శాయంపేట : భారతదేశ అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశ్రాంతి లేకుండా కృషి చేస్తున్నారని భూపాలపల్లి జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ జన్నె మొగిలి అన్నారు. ప్రగతిసింగారం గ్రామంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతున్న ఏకైకా ప్రధాని నరేంద్ర మోదీ అని కొనియాడారు. మండలంలోని బీజేపీ కార్యకర్తలు, అభిమానులు 8800002024 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చుసుకొని ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

ఏసీపీ కిశోర్‌కుమార్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏసీపీ కిశోర్ కుమార్

దామెర : వివిధ సమస్యల పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. మొదటగా పోలీస్ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సన్నిహిత కేంద్రంలో ఫిర్యాదుల స్థితిని అడిగితెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, ఏఎస్సైలు యాకయ్య, రమేష్, సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కుప్పలతో పొంచిఉన్న ప్రమాదం



సోడాషపల్లి-మల్లికుదుర్ల గ్రామాల మధ్యలో రోడ్డుపైనే ఆరబోసిన ధాన్యం

వేలేరు : రైతులు పండించిన ధాన్యం కుప్పలుగా ఆరబెట్టడంతో ప్రమాదాలకు తావిస్తున్నాయి. ధాన్యాన్ని రోడ్లపైనే ఆరబెట్టడడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు ధాన్యం కుప్పలు సరిగా కనిపించక పోవడంగో ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.